క్లుప్తంగా

వేగవంతంగా రుణాల రికవరీ



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వర రావు, ఈవోపీఆర్డీ పాపారావు, హౌసింగ్ ఏఈ సూరిబాబు

గూడెంకొత్తవీధి: డ్వాక్రా సంఘాలకు వెలుగు ద్వారా అందజేసిన స్త్రీనిధి రుణాలను రికవరీ చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వెలుగు సీసీలు, సిబ్బందితో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. వ్యక్తిగత రుణాలను పెంచాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సాధ్యమైనంత వరకూ బ్యాంకు లింకేజీల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు.
ఈవోపీ ఆర్డీ పాపారావు, హౌసింగ్ ఏఈ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



ఇరాడపల్లిలో యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బమ్మ

పాడేరు రూరల్: మండలంలో ఇరాడపల్లి పంచాయతీ కేంద్రానికి చెందిన గిరిజన యువతకు ఎంపీటీసీ సభ్యురాలు ముదిలి సుబ్బమ్మ ఆధ్వర్యంలో బుధవారం వాలీబాల్ కిట్లు అందజేశారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు గిరిజన అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పీసా కమిటీ మాజీ ఉపాధ్యక్షులు సత్యనారాయణ, సొసైటీ బ్యాంక్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లునాయుడు, నాయకులు బాబులు నాయుడు, సింహాచలం, నీలకంఠంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ కుమారి, సర్పంచ్ కాసులమ్మ తదితరులు

గూడెంకొత్తవీధి: వంచుల పంచాయతీ మురగడాపల్లిలో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ బోయినకుమారి ప్రారంభించారు. సర్పంచ్ వి.కాసులమ్మతో కలిసి ఆమె ఈ పనులను ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యురాలు సరస్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధం



కాలిపోయిన సామగ్రిను పరిశీలిస్తున్న గ్రామస్తులు, గిరిజన సంఘం నేతలు

అరకులోయ టౌన్: మండలంలోని మారుమూల బస్కీ పంచాయతీ బిజ్జగుడ గ్రామంలో కిల్లో పొల్లు ఇంట్లో బుధవారం ఉదయం విద్యుత్ షార్ట్ షర్క్యూట్‌తో సామగ్రి దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. ఉదయం 9 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లోని దుస్తులు, విలువైన టార్పాలిన్లు ఇతర వస్తువు లు కాలిబూడిదైనట్టు చెప్పారు. ప్రమాదంలో సర్వం కోల్పోయానని గిరిజనుడు పొల్లు వాపోయాడు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి, ఆదుకోవాలని గిరిజన సంఘం నాయకులు బాబూరావు, ఆనందరావు, రామచందర్ తదితరులు కోరారు.

అక్రమ అరెస్టులు సరికాదు

పాడేరు రూరల్: ప్రధాని మోదీ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో సీపీఎం నాయకులను నిర్బంధించి అక్రమ అరెస్టులు చేయడం సరికాదని పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటనకు ముందు రోజు నుంచి నాయకుల అక్రమ నిర్బంధం చేయడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బల్క్ డ్రగ్స్ పార్కు నక్కపల్లి వద్ద ఏర్పాటు చేయవద్దని ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో పాటు సీపీఎం నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించాలన్నారు. దేశంలో బీజేపీ నిరంకుశ పాలనపై ప్రజలందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఘాట్ రోడ్డులో రక్షణ గోడలు ధ్వంసం | పెరుగుతున్న ప్రమాదాలు | ఆందోళనలో వాహనచోదకులు | పట్టించుకోని అధికారులు

ప్రయాణం.. ప్రమాదకరం



ఘాట్ రోడ్డులో రక్షణ గోడ లేని మలుపు

పాడేరు : పాడేరు–చోడవరం ప్రధాన రహదారి ఘాట్ రోడ్డు ప్రయాణంలో వాహనదారులకు రక్షణ లేకుండా పోతోంది. ఈ మార్గంలో రక్షణ గోడలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో వాహచోదకులు రాకపోకలు సాగించేందుకు హడలిపోతున్నారు. ఈ ప్రధాన మార్గంలోని గరికిబంద నుంచి మినుములూరు వరకు సుమారు 25 కిలోమీటర్ల మేర ఎత్తేన కొండల నడుమ మార్గం ఉంది. ఈ ఘాట్ మార్గంలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి.

శిథిలావస్థలో రక్షణ గోడలు

ఏళ్ల క్రితం నిర్మించిన ఈ దారిలో రక్షణ గోడలు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. చాలా చోట్ల కూలిపోయాయి. అనేక చోట్ల పాక్షికంగా ధ్వంసమై దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. పలు చోట్ల రక్షణ గోడలే లేవు. పాడేరు వచ్చేందుకు చోడవరం, మైదాన ప్రాంతానికి వెళ్లేందుకు ఈ ఘాట్ మార్గమే ప్రధానం. నిత్యం వందల సంఖ్యలో బస్సులు, కార్లు, జీపులు, లారీలు, వ్యాన్లు, ట్రాన్స్‌పోర్టు వాహనాలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రక్షణ గోడలు సక్రమంగా లేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వాహనాలు లోయల్లోకి దూసుకుపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. పదుల సంఖ్యలో వాహనదారులు మృత్యువాత పడ్డారు. మరికొంతమంది క్షతగాత్రులయ్యారు. ఏదైనా ప్రమాదం జరిగితే కానీ ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. ప్రమాదం జరిగిన ప్రదేశాల్లోనే రక్షణ గోడలు తాత్కాలికంగా నిర్మించి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఈ ఘాట్ మార్గంలో పూర్తిస్థాయిలో రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణికులు, వాహనచోదకులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ ఈఈ బాల సుందర్ బాబు వద్ద ప్రస్తావించగా ఘాట్‌రోడ్డు సమస్యపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.



ప్రమాదకర మలుపు

ఘాట్ రోడ్డు ప్రయాణం భయం.. భయం

నిత్యం పాడేరు–చోడవరం మార్గంలో ప్రైవేటు జీపు సర్వీసు చేస్తుంటాను. ఘాట్‌లోని చాలా చోట్ల పూర్తిగా రక్షణ గోడలు లేవు. దీంతో ప్రయాణం భయం, భయంగా సాగుతోంది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో రక్షణ గోడలు నిర్మించాలి.

– జగదీష్, ప్రైవేట్ జీపు ఆపరేటర్, పాడేరు



కూలిన రక్షణ గోడ

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలి



రైతు బజారు వద్ద కూరగాయల దుకాణదారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో కుమార్

పాడేరు : పాడేరు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు దుకాణాదారులందరు సహకరించాలని డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్.కుమార్ కోరారు. ఈవో పీఆర్డీ రమేష్‌తో కలిసి పట్టణంలో పాత బస్టాండ్ వద్ద రైతు బజార్‌లో దుకాణాదారులతో సమావేశమయ్యారు. రైతు బజారులో కేటాయించిన దుకాణాల్లోనే వ్యాపారాలు కొనసాగించాలన్నారు. జిల్లా కేంద్ర కావడంతో ట్రాఫిక్ రోజు, రోజుకు పెరుగుతుందన్నారు. రోడ్డు మార్జిన్‌లో ఎట్టి పరిస్థితుల్లో దుకాణాలు నిర్వహించొద్దని సూచించారు. రైతు బజార్‌లో అవసరమైన మౌలిక వసతుల కల్పన కోసం కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. పాత బస్టాండ్ అంబేద్కర్ కూడలి వద్ద రహదారి పక్కన మార్జీన్‌లు వేయాలని ఎవరికీ దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వోద్దని ఈవీపీఆర్డీ రమేష్‌ను ఆదేశించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రచారం



ప్రచారం చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గూడెంకొత్తవీధి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మకు మద్దతుగా ఏపీటీఎఫ్ నాయకులు బుధవారం ప్రచారం చేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని పలు పాఠశాలలు, కళాశాలను ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతిరాజు సందర్శించి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కేటగిరీలో మొదటి ప్రాధాన్యత ఓటును రఘువర్మకు వేసి గెలిపించాలని కోరారు. నాయకులు మురళి, శశికుమార్, గంగరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటలపై దృష్టి సారించాలి

చింతపల్లి: గిరిజన ప్రాంతంలో రైతాంగం గంజాయి వంటి పంటలపై కాకుండా ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలో చింతలూరు, చినబరడ గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. రైతులు గంజాయి వంటి పంటల సాగుకు దూరంగా ఉండాలని అదే విధంగా ప్రత్యామ్నాయ పంటలపై కూడా దృష్టి సారించాలన్నారు. పంటలు చేపట్టడంలో భూసార పరీక్షలు, వ్యవసాయ యంత్రాలు పరికరాలు వినియోగం వంటి వాటి ప్రాముఖ్యతలను వివరించారు. జాతీయ ఆహార భద్రత, రైతు గుర్తింపు కార్డు, బిందు సేద్యం అవశ్యకతను వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు రూరల్: చింతపల్లి, జి.మాడుగుల మండలాల పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో 11 కేవీ ఫీడర్ల మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపా రు. చింతపల్లి, సబ్‌స్టేషన్‌లో 11కేవీ ఫీడర్ మరమ్మ త్తు పనులతో పెదవలస, సంకాడ, రొంపలు, నిమ్మలపాలెం తదితర గ్రామాల్లో, జి.మాడుగుల మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఫీడర్ రిపేర్ కారణంగా బందవీధి, శింగర్బ, కోరపల్లి, సుర్మతి, భీరం తదితర గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీవో లక్ష్మీదేవి

గూడెంకొత్తవీధి: బాలికలు, మహిళల రక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమశాఖ మండల ఐసీడీఎస్ పీఓ లక్ష్మీ దేవి అన్నారు. మండల కేంద్రంలో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు కిశోర వికాసంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. కౌమార దశలో పాఠశాల డ్రాప్ అవుట్స్ బాలికలు 402 మందిని గుర్తించామన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించామన్నారు. మహిళలకు వృత్తిపరమైన నైపుణ్యాలపై అవసరమైన శిక్షణలు ఇచ్చి వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి విభాగ అధికారి రోహిణి తెలిపా రు. ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి సూచనలు



సమావేశంలో సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

గంగవరం : మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు జరుగుతన్న కిశోర వికాసం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ, విద్యార్థుల శాతం తదితర అంశాలపై ఎంపీడీవో పీజీ రామకృష్ణ సమీక్ష నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీడీపీవో కార్యాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశాన్ని బుధవారం ఎంపీడీవో నిర్వహించారు. సూపర్‌వైజర్లు సత్యవతి, జయలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పనకు కృషి

అడ్డతీగల: చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బొల్లంగి వేణుగోపాల్ డిమాండ్ చేశారు.అడ్డతీగలలో బీసీ సంక్షేమ సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి కమిటీల ఏర్పాటులో భాగంగా మన్యంలో పర్యటిస్తున్నట్టు ఆయన చెప్పారు.బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, ప్రైవేటు సంస్థల్లోనూ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో 52 శాతం రిజర్వేషన్లు బీసీలకు దక్కేలా చూడాలన్నారు. ఆయా అంశాల సాధనకు విశేష కృషి చేయడానికి చిత్తశుద్ధితో ప్రయత్నిస్తామన్నారు. కాకినాడ జిల్లా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.



బీసీ సంఘం నాయకులతో రాష్ట్ర కన్వీనర్ వేణుగోపాల్ తదితరులు

భూ ఆక్రమణలపై ఫిర్యాదు

హుకుంపేట: స్థానిక సచివాలయ కేంద్రంలో బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. అక్రమ నిర్మాణాలు, భూ ఆక్రమణలపై అధికారులను గిరిజన సంఘం, సీపీఎం నాయకులు నిలదీశారు. నాయకులు కృష్ణారావు,హైమవతి మాట్లాడుతు గిరిజనేతరులు చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికై నా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ నిర్మాణాలు, భూకబ్జాలపై నాయకులు తహసీల్దార్ జై ప్రకాష్‌కు ఫిర్యాదు చేశారు. వైస్ ఎంపీపీ కొండలరావు, నాయకులు ఆనంద్, కృష్ణమూర్తి తదితరులున్నారు.

పీసా కమిటీ ఎన్నిక రద్దుకు వినతి

కొయ్యూరు: కొమ్మిక పంచాయతీ కొప్పుకొండ పరిధిలో నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కోరుతూ స్థానికులు బుధవారం ఎంపీడీవో ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. గిరిజనేతరులకు మద్దతు పలుకుతూ నిర్వహించిన ఎన్నికను రద్దు చేయాలని కోరారు. ఎకొత్త తుమ్మలబంద, రేవళ్లు, పాత తుమ్మలబంద, కొమ్మిక ఊరలొద్ది, తాళ్లపాలెం చెందిన గిరిజనులు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తులకు పీసా కమిటీ ఎన్నికలపై కనీస సమాచారం కూడా లేదని కోరం లేకపోయినా ఎన్నికలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమన్నారు.

సదరం పత్రాల పరిశీలన

అడ్డతీగల: మండలంలోని కిమ్మూరు గ్రామంలో పాడేరుకు చెందిన వైద్యులు బి.వి.వి.సత్యనారాయణ, ఎ.ఎస్.వీరమణి కార్తీక్ తదితరులు బుధవారం పర్యటించి, హెల్త్ పింఛన్ల ప్రక్రియను పరిశీలించారు. ఇందులో భాగంగా పింఛన్‌దారులు సంపతి మురళిని కలిసి పింఛన్ మంజూరు, పొందుతున్న వైద్య సేవలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాల్లో పలువురు లబ్ధిదారుల సదరం సర్టిఫికెట్లను పరిశీలించారు. వెలుగు ఏపీఎం నాయుడు, వెలుగు కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు, కిమ్మూరు సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎం, మహిళా పోలీస్ తదితరులున్నారు.

అందరి సహకారంతోనే అభివృద్ధి సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలితకుమారి, వేదికపై అధికారులు

మారేడుమిల్లి: అందరి సహకారంతో మారేడుమిల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని ఎంపీపీ లలితకుమారి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పారదర్శకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మండల ప్రగతి నివేదికను సమావేశంలో వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులు రూ. 290 వరకు రోజు వారి వేతనం పొందుతున్నారని తెలిపారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు మేరకు మండలాన్ని ప్లాస్టిక్ రహిత మండలంగా తీర్చిదిద్దాలని ,పారిశుధ్య నిర్వహణ సక్రంగా జరిగేలా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు.

సభ్యుల తీర్మానాలు

పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ అక్రమణకు గురైన మారేడుమిల్లి ప్రధాన కూడలిని సరిచేయాలని, అక్రమణదారులపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యాటకుల కేంద్ర బిందువుగా ఉన్న మారేడుమిల్లిలో అక్రమ రిసార్ట్స్ పుట్టగొడుగులలా వెలిశాయని వాటిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. పదో తరగతి పరీక్షలో మంచి మార్కులు సాధించి విద్యార్థికి మండల సాధారణ నిధుల నుంచి రూ. 5వేలు నగదు పారితోషకంగా ఇచ్చేందుకు సమావేశం తీర్మానించింది. ముందస్తు అనుమతి లేకుండా సమావేశానికి హాజరు కాని అధికారులపై కలెక్టరు దినేష్‌కుమార్‌కు, ,ఆయా శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సభ్యులు తీర్మానించారు. జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీబాబు, ప్రత్యేక అధికారి చైతన్య, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

జీఎం వలస పంచాయతీ కార్యదర్శికి నోటీసులు

మారేడుమిల్లి మండల సమావేశంలో అనుచితంగా ప్రవర్తించిన జీఎం వలస పంచాయతీ కార్యదర్శి కృష్ణప్రసాద్‌కు నోటీసు జారీ చేసినట్టు ఎంపీడీఓ విశ్వనాథ్ తెలిపారు. నిబంధనల ప్రకారం సమావేశంలో సభ్యులు మాత్రమే చర్చలో పాల్గొవాలని, అయితే కార్యదర్శి కృష్ణప్రసాద్ వ్యవసాయ శాఖ ఉద్యోగిని ప్రశ్నించడంపై వారించడం జరిగిందన్నారు. విద్యాశాఖ సమీక్షంలో మండలంలో డ్రాప్ అవుట్స్ ఎక్కువగా ఉన్నారని, పట్టించుకోవడం లేదని వివరణ కోరారు.

గ్రామాల్లో సమస్యలపై పీవోకు వినతి

చింతూరు: రైతు, కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ అనుబంధ ఆల్ ఇండియా యునైటెడ్ కిసాన్ సభ జిల్లా నాయకురాలు కెచ్చెల కల్పన బుధవారం ఐటీడీఏ పీవో అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని, ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ 600 కూలీ చెల్లించడంతో పాటు 200 పనిదినాలు కల్పించాలని కోరారు. చిన్న, సన్నకారు రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, అటవీ హక్కుల చట్టాన్ని సమగ్రంగా అమలు చేయాలని, పోడు సాగుదారులకు హక్కుపత్రాలు కల్పించాలనిడిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురువారం చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు భీమరాజు, జోగారావు, రమేష్, వీరరాఘవులు, జోగారావు పాల్గొన్నారు.

చింతూరు: తన ఫోర్జరీ సంతకంతో పొదుపు ఖాతాలోని నగదు విత్‌డ్రా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం ఐటీడీఏ పీవో అపూర్వభరత్‌కు ఫిర్యాదు చేసినట్టు వీఆర్ పురం మండలం రేఖపల్లికి చెందిన వేంపాటి పద్మ అనే మహిళ తెలిపారు. నగదు విత్‌డ్రా చేసుకున్న విషయం తెలిసి గ్రూపు సభ్యులను ప్రశ్నిస్తే తనను గ్రూపు నుంచి తొలగించాలని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై తగిన విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆందోళన



చింతూరులో ఏడీఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

చింతూరు: ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్, సర్దుబాటు చార్జీల పేరుతో కోట్లాది రూపాయల భారాన్ని మోపడానికి సిద్ధపడిందని ఈ ప్రక్రియను వెంటనే విరమించుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక విద్యుత్ ఏడీఈ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని ప్రజలకు హామీ నిచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ హామీని తుంగలో తొక్కి విద్యుత్ చార్జీల పెంపుదలకు సిద్ధమైందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఆలోచనను విరమించుకోవాలని, మండలంలోని బలిమెల, చుక్కలపాడు, కొత్తూరు, పావుర్లంక గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని కలిగించాలని వారు కోరారు. నాయకులు వెంకట్, సురేష్, శ్రీనివాస్, లక్ష్మణ్, మల్లేష్, సుబ్బారావు, రాంబాబు, కన్నయ్య, రాజయ్య పాల్గొన్నారు.

నిధుల మంజూరులో వివక్ష తగదు

గూడెంకొత్తవీధి: రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీలకు గతేడాది నవంబరులో 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయగా గూడెంకొత్తవీధి మండలంలోని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు పనిచేస్తున్న ఆరు పంచాయతీలకు నిధులు జమచేయకపోవడంపై సర్పంచ్‌లు ఆవేదన చెందారు. ఈ మేరకు మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కుందరి రామకృష్ణ, లక్కవరపేట సర్పంచ్ వీరేంద్రపడాల్ తదితరులు ఎంపీడీవో ఉమామహేశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలకు నిధులు జమ చేయకుండా తాత్సారం చేస్తుందన్నారు. దీనిపై ఇప్పటికే తాము పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. మండలంలోని అన్ని పంచాయతీలకు తక్షణమే నిధులను మంజూరు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వారు కోరారు.

దుప్పట్లు పంపిణీ

చింతపల్లి: మండలంలో లంబసింగి పంచాయతీ పరిధిలో పలు గ్రామాలకు చెందిన 400 మంది ఆదివాసీలకు సాన్ చారిటీ వ్యవస్థాపకుడు అప్పలనాయుడు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ కార్యక్ర మాన్ని బుధవారం చేపట్టారు. ఏజెన్సీలో చలి తీవ్రతను పేద ఆదివాసీలు ఇబ్బంది పడకుండా తిరుపతికి చెందిన పీపుల్స్ చారిటీ సంస్థ ఆర్థిక సాయంతో నర్సీపట్నానికి చెందిన సాన్ చారిటీ సంస్థ సభ్యులు దుప్పట్లు సమకూర్చారు. ఈ మేరకు లంబసింగి పంచాయతీ పరిధిలోగల చెరువులవేనం, బంతిబైలు, రింగుడుమెట్ట, భీమనాలపపల్లి, చీకటిమామిడి, టేకుబంద, వాడగడ్డ తదితర గ్రామాల్లో గిరిజనులకు ఈ పంపిణీ చేశారు. లంబసింగి మాజీ సర్పంచ్ కొర్రా రఘునాథ్, నాయకులు నూకరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



భీమనాపల్లిలో గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

శబరిమలకు మాలధారుల పయనం



పూజలు చేస్తున్న మాలధారులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలో అయ్యప్ప సేవ పీఠంలో 120 మంది అయ్యప్పమాలధారుల మండల కాలం దీక్షల ఇరుముడుల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దీక్ష పూర్తి చేసుకున్న మాలధారులు ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వాములు సూరిబాబు ,గుప్తేశ్వరరావు, రాంబాబు మాలధారులకు ఇరుముడి కట్టారు. అనంతరం మాలధారుల ఏర్పాటు చేసిన హుండీ వేలం పాటను నిర్వహించారు. చిల్లర నాణేల వేలంపాటను రూ.40వేలకు జగదీష్ పాడి, రూ.10, రూ.20 నోట్లను రూ.42వేలకు జయరాజ్, కుమార్ సోదరు లు, రూ.50 నోట్లను రూ.37వేలకు పాడేరుకు చెందిన కిల్లో శ్యామో, రూ.100, రూ.200, రూ.500 నోట్లను లక్ష21వేలకు అనకాపల్లికి చెందిన గంగాభవానిలు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు .అనంతరం 120 మంది అయ్యప్ప మాలధారులు ప్రత్యేక వాహనాల్లో శబరిమలకు ప్రత్యేక వాహనాలలో పయనమయ్యారు.

ఖాతాదారులకు తప్పని అవస్థలు



అరకులోయలోని ఎస్‌బీఐ ఎదుట నిరసన తెలుపుతున్న ఖాతాదారులు, సీపీఎం నేతలు

అరకులోయటౌన్: అరకులోయలోని ఎస్‌బీఐలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో ఎస్‌బీఐ ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.
అరకులోయ ఎస్‌బీఐలో మూడు రోజులుగా పూర్తి స్థాయిలో సిబ్బంది విధులకు సక్రమంగా రాకపోవడంతో బ్యాంకుకు వచ్చే ఖాతాదారులు రోజంతా వేచి చూసి పనులు జరగక నిరాశతో వెనుతిరిగి వెళ్తున్నారని ఆరోపించారు. బ్యాంక్ ఎదుట ఖాతాదారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. బ్యాంకులో ఈకేవైసీ, అకౌంట్ స్టేటస్ తదితర సేవలందించే కౌంటర్‌లలో సిబ్బంది లేరని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రస్తుతం పండగ సెలవుల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులు స్వగ్రామాలకు తరలివస్తుంటారని, బ్యాంకు సేవల ఆవశ్యకత ఉంటుందని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని కోరారు. నాయకులు బుజ్జిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.